

# వెన్నెల్లో సన్నజాజిలా

మాలతీ చందూర్

చైత్ర మాసంలో శుక్లపక్షపుద్వాదశి. మంచంమీదకి పుచ్చ పువ్వులాంటి వెన్నెల కురుస్తోంది. ఒక్కసారి ఎవరోతట్టినట్లు వులిక్కిపడి కళ్ళు తెరిచాడు నారాయణమూర్తి. మంచం మీద — తనమీద వెన్నెల వెన్నులోంచి చలివచ్చినట్లయింది. గడియారం వంక చూశాడు. రెండూ అయిదు నిముషాలయింది. అంతా నిశ్శబ్దం. చుట్టూ నిశ్శబ్దం. బయట వెన్నెల — గదిలో వెన్నెల—తనమీదవెన్నెల. అంతవరకూ ఉక్కతో తడిసిన అతను ఒక్కసారి నిలువెల్లా వణికాడు, గబాలునలేచి—కిటికీ రెక్కలుమూశాడు. గోడమీద టేబుల్ మీదవంగినవెన్నల—వెంటిలేటరులోంచి వెన్నెల కిరణాలు పడ్తున్నాయి.

నిద్రమత్తు వదిలిపోయింది. ఇక నిద్దరరాదు. ఈ వెన్నెలనుంచి తను పారిపోలేడు. తనని వెన్నంటి ఆలోచింప జేస్తుందీవెన్నెల. నిద్దరపట్టని యీ బుర్రని పట్టుకోలేడుతను. బుర్రవేగంగా-వేగంగా పరుగెడ్తుంది—తను వద్దన్న మార్గాల. ఒక్కసారి యిటునుంచి అటు దొర్లాడు. పుస్తకం తెరుస్తే? వుహు; లాభంలేదు. చదివినబంతినే—పదిసార్లు చదువుతాడు. ఏం చదివాడో బుర్రకెక్కదు. అర్ధరాత్రి. అందులో వెన్నెల రోజుల్లో మెళుకువ వస్తే—తన గది యింతే.

తనకి వెన్నెలంటే భయం. వెన్నెలంటే అసహ్యం. కొబ్బరాకుల నీడలంటే కోపం. సినిమాలంటే అసహ్యం. సన్నజాజులంటే అసహ్యం. తనమీద తనకే అసహ్యం. భగవాన్. యీ ఆలోచనలనుంచి—నాకు విముక్తి లేదా? ఎన్ని—వేలసార్లు ఆలోచించాను! ఎన్ని రాత్రులు యిట్లా నిద్రలేకుండా గడిపాను. తన జీవితం ఆఖరిదాకా యీ ఆలోచనలు పీడిస్తూనే వుంటాయి. ఈ జ్ఞాపకాలకి మందు లేదా? భగవాన్, యీ జ్ఞాపకాల నుంచి, నన్ను వొడ్డున పడెయ్యి. ఒక్కసారి వత్తిగిలాడు. ఎదురుగా తెల్లని గోడ-గోడమీద విరిగినట్లు పడిన నీడ. తన జీవితం ఆ నీడ లాగానే వంగి—విరిగి పోయింది. మరి సాఫీ అవదు.

కాకులన్నీ ఒక్కసారి కావున అరిచాయి. మళ్ళీ నిశ్శబ్దం. యీ వెన్నెల చూసి తెల్లవారిందని మోసపోయి కావు కావున అరుస్తున్నాయి. ఇప్పటికి ఎన్ని సార్లు విన్నాడో ఆ కాకుల అరుపులని. తనకి వెన్నెలలో నిద్దరరాదు. వెన్నెలంటే భయం. చీకటిరాత్రులు మెళుకువ రాకుండా నిద్దర పట్టిపోతుంది. కాని యీ వెన్నెలరాత్రుళ్లు తనకి కన్ను మూతపడదు. తలగడకిందనున్న అగ్గిపెట్టె తీసి సిగరెట్ ముట్టించాడు.

ఎక్కడో నిద్దట్లో పసిపిల్ల ఏడుపు కెవ్వున వినిపించింది. మళ్లీ అంతా నిశ్శబ్దం. ఎన్నాళ్లయింది తను హాయిగా-నిర్మలంగా నిద్దరపోయి? పదిహేనేళ్లు. పదిహేనేళ్లబట్టి యీ బరువుని తను మోస్తున్నాడు. ఎన్నిసార్లు చూసిన—సినిమాలాగా—ఆనాటి సంఘటన—కళ్ల ముందు మెదుల్తోంది. ఆ సంఘటన, ఆలోచనలు తన మెదడులోకి రాకుండా వుండాలని—ఎంత ప్రయత్నించినా—నిష్ఫలమై పోతోంది.

"వెన్నెల—కొబ్బరాకుల నీడలు, జాజులు. కనకాంబరపు వాయిల్ వోణీ—నల్లపూల జాకెట్టు"-సినిమా మళ్లీ మొదలవుతోంది. అసలు యీ సినిమాకి-నాందీ తన తండ్రి మరణం. తన తండ్రి బ్రతికివుంటే—తా నీనాడు యీ వెన్నెలకి భయపడే వాడు కాదు. నాన్న పోయారు-అన్నీ అనుకోని విచిత్ర సంఘటనలు



"ఏరా? మీ ఆవిణ్ణి తీసుకొచ్చేందుకు పోలేదేం?"
"నేను పోనక్కర్లేకుండానే సరిపోయింది."
"మీ మామే తీసుకొచ్చి వదలిపెట్టెల్లాడా ఏమిటి?"
"ఆఁ! ఇంటర్ మీడియేట్ చదివేందుకు మా బావమర్దినీ, కంటి ఆపరేషన్ చేయించుకొనేందుకు వాడి నాయనమ్మనూ. ఆమెకు తోడు వాళ్ళక్కయ్యనూ తీసుకొచ్చాడు."

జరిగిపోయాయి. తనకి మనశ్శాంతి కరువయింది.

తను ఎమ్మే మొదటి సంవత్సరంలో వుండగా, నాన్న పోయారు. క్రిస్మస్ సెలవలు అయిపోయాక పోయారు. ఆ రెండు నెలలూ, అమ్మా—అక్కా అంతా శోక సముద్రంలో మునిగి పోయారు. వేసంగి సెలవలకి—తను బెనారస్ నుంచి రాగానే అక్క పిల్లలని తీసుకుని భర్త యింటికి వెళ్ళిపోయింది. ఇంట్లో పోర్షన్స్ పూర్తిగా అద్దెకిచ్చేసి ఓవైపు వాటా మటుకు తమ కింద వుంచుకున్నారు. ఇల్లంతా బావురుమంటూ వుండేది. అమ్మవంక తలెత్తి చూడలేక పోయేవాడు. ఆమె కళ్ళలో దైన్యం, దుఃఖం, అసలు అమ్మ రూపే మారి పోయింది. ఆమెని చూస్తే. తనకి ఏదో భయం దుఃఖం కలిగేది. తన చదువు ఆ సంవత్సరానికి ఆపు చేస్తానన్నాడు. అమ్మ వొప్పుకోలేదు. పోనీ అమ్మని తనతోపాటు బెనారస్ రమ్మనమన్నాడు. ఆమె అందుకూ వొప్పుకోలేదు. స్వంత వూరు. యిల్లూ వాకిలి వదిలిరానంది. వూళ్ళో మామయ్యా వాళ్లూ వున్నారు— ఎల్లాగో ఆ ఏడాది గడిపేస్తానంది.

అమ్మని వంటిగా వదిలి వెళ్లడం తనకి యిష్టంలేదు. ఇంట్లో సాయంగా ఎవరినైనా వుంచుతే—ఎవరుంటారు? మామయ్య పిల్లలు తల్లిని వదిలివుండరు. తమ కోసం ఎవరొస్తారు? అవ్వాళ రాత్రి అన్నం తింటుంటే చెప్పింది అమ్మ. తమ మూడు గదుల్లో ఒక గది—ఆ తల్లీ కూతుళ్లకి యిస్తున్నామని. "తల్లీ పిల్లా నాకు సాయంగా వుంటారు. పాపం బీదవాళ్లు. వాళ్ల అద్దె యిచ్చుకోలేరు. నాకు మనిషి సాయంకావాలి ఆ పిల్ల స్కూల్లో చదువుకుంటోంది. నాకు యీ పనీ ఆ పనీ చేసి పెడ్తూ టారు అని. తన కీ ఏర్పాటు ఒక విధంగా బాగానే వుంది. పైకి ఎంత గంభీరంగా వున్నా లోపల అమ్మ వొక్కర్తే—ఆ యింట్లో

వండుకుని తినాలి. అంటే బెంగగా వుంది. ఏదో వెర్రిగా వుంది.

తనకి మేడమీద గది విడిగా ఎల్లానూ వుంది. కింద తనసలు వుండనేవుండడు-భోజనస్నానాలవీతప్ప. తమకి లోంగు బాటుగా వుండే కుటుంబం దొరకడం ఒకవిధంగా బాగానే వుంది. వాళ్ల ఏనాడు వొచ్చి ప్రవేశించింది తనకి తెలియనే తెలియదు. ఇంట్లో తెల్ల పంచలే చూడటానికి అలవాటుపడ్డ తనకి— ఒకటి రెండుసార్లు— పూల వోణీలు—రంగు చెంగులు కంటపడ్డాయి. అమ్మ చెప్పినవాళ్లు కాబోలు అనుకున్నాడు.

వాళ్లొచ్చి నెల్లాళ్లయింది. తనకి ఆడపిల్లలమీద అంత శ్రద్ధలేదు మొదటి నుంచి. తోటి స్టూడెంట్సూ, కొందరు రూమ్ మేట్సూ ఆడపిల్లలగూర్చి విచిత్రమైన కథలు చెపుతుంటే, భయంతో సిగ్గుతో వినేవాడు. లోపల కుతూహలంగా వున్నా వాళ్లకి మల్లే తెగించి వినాలంటే భిడియంగా వుండేది. తనకి మొదటి నుంచి ఆడపిల్లల్తో అంత చనువు లేదు. జ్ఞానం తెలిసేసరికి, అక్క, అత్త వారింటికి వెళ్లిపోయింది. తన యిల్లూ పరిసరాలూ, వీటిల్లో అసభ్యకరమైన మాటలకి—తావుండేది కాదు.

గుడ్డిదోమ కాబోలు—పదేపదే సంగీతం పాడుతోంది. ఎన్నిసార్లు తోలినా పోవడం లేదు. కుడిచెవ్వి, ఆ దోమను సూదంటురాయిలా ఆకర్షిస్తోంది కాబోలు. పదేపదే సంగీతసాధన చేస్తోంది. మంచంమీంచి లేచాడు. కిర్రుమంది మంచం. ఇక పడుకోబుద్ధి పుట్ట లేదు. పడక కుర్చీయే తనకి శరణ్యం. స్విచ్ వేసి, చదువుకుంటే—వుహూ ఈ ఆలోచనా కథ—పూర్తి అవ్వాలి. మళ్లీ పూర్తిగా తిరగతోడాలి. తెల్లారిపోతుంది. ఎర్రగావున్న తనకళ్లని చూసి—"రాత్రి నిద్దర పట్టలేదా?" అంటుంది భార్య. అదేదో అలవాటు ప్రశ్నలా.

"లేదు" అంటాడు తాను ఎప్పటిలాగానే.

"పోనీ, నిద్దర మాత్రలు వేసుకోరాదుటండి. అట్లా ఆరోగ్యం చెడకొట్టుకునేకంటే" అంటుంది.

"వుహూం. తను నిద్రకి మందు వాడ లేదు వాడడు. తన పాపానికి. యీ మాత్రం ప్రాయశ్చిత్తం కావాలి. బ్రతికి నన్నాళ్లూ వెన్నల రాత్రిళ్లు—ఆ ఆలోచనలతో గడపాల్సిందే — భగవాన్ యింకెన్ని రాత్రిళ్లు — యింకెన్ని రోజులు?"

మరోసిగిరెట్ వెలిగింది. ఆడవాళ్లు పరిసరాల్లో చాలా సహజంగా కలిసి పోగలరు. పరాయియింట్లోకూడా సొంత యిల్లులాగా సర్దుకుపోగలరు. మొదట్లో లీలగామాత్రం కనపడ్డ ఆ వోణీచెంగు క్రమక్రమంగా తన ఎదరపడజొచ్చింది. అమ్మ పూజలోవుంటే స్నానానికి నీళ్లు

తోడటం, మధ్యాహ్నంవేళ అమ్మ నిద్దర పోతుంటే — వీధితలుపు ఘడియ తియ్యడం, తను కిందకి రాకపోతే — కాఫీ మేడమీదకి తీసుకునిరావడం, క్రమంగా తమయింట్లో చిరపరిచితురాల్లాగా మసలుతూండేది. అనవసరమైన సిగ్గుగాని-లేనిపోని కులుకులుగాని చూపేది కాదు. మామూలుగా యింట్లో పిల్లలా తిరుగుతూండేది. తనకి మొదట్లో మొహమాటంగావున్నా, క్రమంగా — "శాంతా, కాఫీ తీసుకురా — శాంతా, ఆ పుస్తకం ఎక్కడ పెట్టావ్ ?" ఇట్లా ఆ పిల్లకి పని చెప్పడం అలవాటయింది.

శాంత అనవసరంగా తనతో మాట్లాడేదికాదు — పనివుంటే తప్ప. ఇంట్లో అమ్మకి సాయం చేస్తూండేది. తన పనులు చేసిపెడ్తూండేది. శాంత తల్లికి ఒక్కతే సంతానం. తండ్రి నీళ్ళకావెళ్ల మోసేవాడు. పునిస్త్రీ తనంలో తల్లి ముత్తయిదువులకీ మూసి వాయినాలకి వెళ్తూండేదిట. అన్నానికి కరువు లేకపోయినా ఒకవిధమైన బీదరికంలోనే గడిచింది వారి జీవితం. తండ్రి పోయాడు. ఈవిడ కొన్నాళ్ళు వంటలు చేసి, కొన్నాళ్ళు నీళ్లుమోసి, కాలం గడుపుకుంటూ వుంది. కూతురు ఎదిగింది. నలుగురి సాయంతో ఆడపిల్లల స్కూల్లో జేర్పించింది పిల్లని. ఫోర్త్‌ఫారమ్ చదువుతున్న శాంతకి వరుడు దొరకడం అన్నది—ఎలాగూ అసంభవం. అందుకని టీచరు చేయిద్దామని ఆశపడుతోంది తల్లి.

తమ యింటికి మడినీళ్లు తెచ్చిపోయడంతో పరిచయం అయింది యీ కుటుంబం. తన తండ్రికి జబ్బుగా వున్నపుడు, అడపా తడపా వంటచేసి, పైపనులూ వగైరా చూసిపెట్టేదిట శాంత తల్లి. పెద్దనోరు లేక వొదిగివుండే స్వభావం కలది కావడంతో, క్రమంగా పప్పులనీ, వడియాలు అప్పడాలనీ — యిట్లా పైపనులన్నీ చేసి తన తల్లి అభిమానం సంపాయించుకుంది. అందుకనే యీ తల్లికూతుళ్ళకి తమ యింట్లో చోటు దొరికింది. బజారుపని, యింటిపని, యీ తల్లి కూతుళ్లు చూసుకుని పోతుండేవారు. తల్లి ఏమిచ్చేదో, వారేం తీసుకునేవారో తెలియదుగాని, ఆ నెల్లాళ్ళలో, తల్లి కాస్త తేరుకున్న ట్లనిపించింది. తనకూ మనసు తేలికయింది.

శాంత తల్లెపుడూ తన ఎదరబడి మాట్లాడేదికాదు. ఒకరోజు తను భోంచేస్తున్నాడు. అమ్మ వడ్డిస్తోంది. శాంత యీ మధ్యన పళ్ళెం ఎత్తడం డ్యూటీ కొత్తగా పుచ్చుకుంది. అందుకని గుమ్మానికి అవతలవైపు నుల్చుంది. "శాంత యింగ్లీషులో వెనకపడ్డదిట. యీ నాలుగు రోజులు కాస్త దానిసంగతి కనుక్కోరా, అబ్బాయ్" అంది అమ్మ.

"నాకు హైస్కూలు వాళ్ళకి చెప్పే యింగ్లీషు రాదమ్మా" అన్నాడు.

"అల్లా అనకండిబాబు. మార్కులు తక్కువ వస్తే. ఆ స్కాలర్‌షిప్ యివ్వ మంటారు. మీరు కాస్త దయదలచాలి" అంది తలుపుకి ఆవైపునుంచి, ఆవిడ శాంత తల్లికాబోలనుకున్నాడు.

ఆ తరువాత తనకి వీలయినపుడు శాంతకి యింగ్లీషుపాఠాలు చెప్పేవాడు. రెండుమూడుసార్లు, ఆ పిల్లని 'మొద్దు బుర్ర' అని విసుక్కున్నాడు కూడా. శాంత కిక్కురుమనేదికాదు. తనే మళ్లీ తిప్పుకునేవాడు. చాలా భయభక్తులతో వుండేది. తనుకూడా ముభావనగా వుండే వాడు. కథల్లోనూ. సినిమాల్లోనూ చెప్పే భావాలేమీ తనకి కలిగేవికావు. అసలు ఆ అమ్మాయివంక తను పరిశీలనగా కూడా చూడలేదు ఎప్పుడూను.

బెనారస్‌లో చదువుకుంటూ వుంటం వల్ల, తన చిన్ననాటి స్నేహితులతో చెప్పలేని దూరం ఏర్పడింది. వూరినించి రాగానే పల్కరించినా తను చిన్నప్పటి ఫ్రెండ్సులో ఏ వొక్కరిద్దరితోనో తప్ప. కలిసిమెలిసి తిరగలేకపోయేవాడు. సాయంత్రం అయేసరికి. ఏ పార్కుకో లేక పబ్లిక్ లైబ్రరీకో, హిందీసినిమాకో వెళ్తాండేవాడు. ఇంట్లో ఎవరూ లేనపుడు తను ఏడు అయేసరికి యింటి కొచ్చేసే వాడు రాత్రిళ్ళు. సినిమాకి వెళ్దామని అనిపించినా తల్లి వొంటరిగా వుంటుం దనే భావన, తన కోర్కెకు కళ్ళెం వేసేది. శాంతావాళ్ళు వచ్చాక, తనకి ఒక విధంగా స్వేచ్ఛ లభించిందనే చెప్పాలి. తను ఆలస్యంగా వచ్చినా, అమ్మ పూర్వం మాదిరి కళ్ళలో వత్తులు వేసుకుని కూచునేదికాదు. ఒక్కొక్క ప్పుడు తను వచ్చేసరికి. అమ్మ నిద్దర పోతూండేది. వీధితలుపు తెరిచినశాంతే, అన్నం వడ్డించి పళ్ళెం కడిగేది. అన్నం పెడ్తున్నపుడు మితంగానే మాట్లాడేది. సినిమాకి వెళ్ళవస్తేమటుకు కథ అడిగి అడిగి వినేది. తను మధ్యమధ్య తప్పులు చెపితే నవ్వేది.

రోజులు సాఫీగా గడచిపోతున్నయి. బెనారస్ ప్రయాణానికి కావలసిన బట్టలూ, వగైరా కుట్టించుకున్నాడు. మెల్లిగా ప్రయాణం సరంజామా సర్దు కుంటున్నాడు తను. ఆ రోజుల్లో తనెంత హాయిగా వుండేవాడు. మనసు నిర్మ లంగా, సుఖంగా వుండేది ఏవో కలలు వుద్యోగం, దూరదేశాలు-ఏవో ఏవో అల్లిబిల్లిగా కలలు కంటూండే వాడు భవిష్యత్‌ని గురించి.

ఆ రోజు మధ్యాహ్నం పకోడీలు చేసింది శాంత. తనకి బాగా జ్ఞాపకం. అమ్మ వుల్లిపాయలు తినదు. తనకి యిష్టమని శాంత చేత చేయించింది ప్రత్యేకం. అమ్మని తలుచుకుంటే ఎందుకో కళ్లు చెమరుస్తాయి తనకి. గంభీరంగా, వుదాత్తంగా తనముందు సాక్షత్కరిస్తుంది తల్లి రూపం.

"పోతన సినిమా వచ్చింది. మీరు చెప్పండి అమ్మగారితో. నేను వెంటపెట్టుకెళ్లి జాగ్రత్తగా తీసుకొస్తాను – చాలా బాగుందిట. మీరు బలవంతపెడితే అమ్మగారు బయలు దేరుతారు" అంది శాంత తల్లి తలుపు వెనకనుంచి.

అమ్మ రానని సాకుచెబుతోంది. "చీకటిపడితేగాని మొదటి ఆట వెయ్యరు. చీకట్లో ఎవరికీ తెలియదు. బండిమీద వెడదాం అంటోంది" శాంత తల్లి. ఎట్లాయితే నేం తన ప్రోత్సాహంతో – అమ్మని సినిమాకి బయలుదేర తీసింది శాంత తల్లి. పెద్దవాళ్లిద్దరూ సినిమాకి వెళ్లేట్లు. శాంత యింట్లోవుండి భోజనం వగైరా చూసేందుకు వొప్పందం అయింది. శాంత సినిమాకివెళ్తానని అనలేదు. తల్లిరమ్మనీ అనలేదు. పదిహేను పదహారేళ్ల వయసులోగల ఆ పిల్ల – కోర్కెలని యింత సహజంగా



చంపుకోడం, తనకి చాలాసార్లు ఆశ్చర్యం కలిగించింది. మాటల్లో పైకి చెప్పక పోయినా, తను వొదిగి వుండడం, మాటిమాటికి నిశ్శబ్దంగా క్రియలో చూపించేది శాంత.

అమ్మావాళ్లు సినిమాకి వెళ్లారు. శాంత ఒక్కర్తే వుంటుందని తను త్వరగా లైబ్రరీనుంచి యింటికొచ్చేశాడు. రాత్రి ఎనిమిది అయింది. అన్నం తినేసి డాబాలో పడక కుర్చీలో కూచున్నాడు తను. పక్కనే దీపం పెట్టుకుని చాప పరచుకు కూచిని చదువుకుంటోంది శాంత. వేసంగి సెలవలాయను—క్లాసు పుస్తకాలు కాక - ఏదో నవల కాబోలు చదువుకుంటోంది. కొబ్బరాకుల నీడలు- చారలు చారలుగా పడుతున్నాయి డాబా గోడ మీద.

వంచిన తల నల్లగా మెరుస్తోంది వెన్నెట్లో. జాజులూ—కనకాంబరాలూ— వెన్నెట్లో లీలగా కనిపిస్తున్నాయి. కిరసనాయలు దీపపు కాంతి—వెన్నెలలో వెలా తెలా పోతోంది.

"ఏం పుస్తకం?" అన్నాడు తను యొాదాలాపంగా.

పేరు చెప్పింది శాంత. తనకి ఆ అమ్మాయిని పల్కరించి మాట్లాడించాలని—ఏదో ఆ అమ్మాయితో మాట్లాడాలని కుతూహలంగా వుంది. అవసరం వున్నంత వరకే మాట్లాడే తను—అట్లా ఎందుకు మాటల్లోకి దిగాడో—యీనాటి దాకా బోధపడదు. పుస్తకాలు, క్లాసు పిల్లలు! స్కూలు యిట్లా ఏవో తను అడుగుతున్నాడు. శాంత మామూలుగా జవాబు చెబుతోంది. వెన్నెల్లో ఆ అమ్మాయి ముఖం—కళ్లు తనకి కొత్తగా వింతగా కనిపించాయి. తను శాంతని— తొలిసారి చూస్తున్నాడా, అన్నట్లు అనిపించింది. ఆ అమ్మాయి ఆగకుండా మాట్లాడాలని, తలలో ఆ జాజులని ఒక్కసారి ముట్టుకోవాలని అనిపించింది. తను నిశ్శబ్దంగా తేరిపార చూడటం గమనించి, శాంత గబుక్కున తల వంచుకుంది. ఆమె బుగ్గలు, ఎన్నడూ లేనిది—సిగ్గుతో మెరిసి పోయినాయి. శాంత తన ముందు సిగ్గు పడటం అది తొలిసారి, ఆఖరిసారి. మొదటి నుంచి తనంటే భయ భక్తులున్నాయేగాని అనవసరమయిన-భిడియంలేదు శాంతకి.

కుర్చీలోంచి లేచి, ఆ అమ్మాయి ప్రక్కన కూచోవాలని, ఆ కనకాంబరు చెంగుని—తన వేలు చుట్టూ త్రిప్పుకోవాలని—ఏదో ఏదో చెప్పలేని భావాలు కలుగుతున్నాయి. అంత వెన్నెట్లో— తనకి ఒక్కసారి చెమటపట్టింది. కుర్చీ యిరుగ్గా, వుదుకుప్టంగా వుంది. కుర్చీ లోంచి లేచి పిట్ట గోడని ఆనుకుని నుల్చున్నాడు. శాంత తల పైకి ఎత్త లేదు. గాలి స్తంభించినట్లు—వూపిరి బిగ పట్టుకు కూచుంది. ఆమె చదవటం లేదని తనకు తెలుసు. ఆ అమ్మాయి

పక్కకి వెళ్లికూచోవాలని, ఆ బుజం మీద చెయ్యివేసి నిమరాలని-తనకి విప రీతంగా కోరిక పుడుతోంది. యీ భావాలు తనకి ఎందుకు కలుగు తున్నాయి? వీటికి అర్థం ఏమిటి? వీటిని గురించి ఆలోచించే వయసు, జ్ఞానం రెండూ లేవు తనకు.

"ఏదీ, పుస్తకంచూడనీ" అంటూ పక్కన కూర్చున్నాడు. శాంత మెదల కుండా పుస్తకంయిచ్చి, వూపిరి బిగబట్టి కూచుంది. పుస్తకం వొదిలేసి—వీపుమీద గభాలున చెయ్యివేసి—ఒక్కసారి నిమి రాడు "శాంతా" అన్నాడు—ఆ పిలుపు ఎంతోమధురంగా – మార్దవంగా తన చెవులమీద పడింది. ఒకసారి నిలువెల్లా వణికింది శాంత. ఎట్లావచ్చిందో—తన వొళ్లోకి ఆమెతల వచ్చిపడింది. అది దుఃఖమో సంతోషమో ఆనందమో భయమో తనకి యీనాటికీ తెలియదు. వణుకుతున్న శాంతని రెండుచేతుల్తో గట్టిగా గుండెలకి వత్తుకున్నాడుతను. వెన్నెల చారలు చారలుగా శాంతమీద పడుతోంది – జాజులు మత్తుగా – మధు రంగా గుబాళిస్తున్నాయి.

హాస్టల్లోని తన(ఫ్రెండ్సు—సగం సగం చెప్పే విషయాలు—పూర్తిగా బోధపడని ఏవోఏవో రహస్యాలు ఆవెన్నెల(ప్రకృతి వయసు తనకి అర్థోక్తిగా తెలిపాయి. శాంత మాట్లాడలేదు—పెనుగులాడలేదు, మౌనంగా వణుకుతోంది. వీధితలుపు కొట్టడంతో తను యీలోకంలోకి వచ్చి పడ్డాడు. కలలోమాదిరి చాపమీద పడు కున్నతను—గభాలునలేచి, కిందికెళ్లాడు తలుపుతియ్యడానికి.

అమ్మావాళ్ళు కాళ్ళు కడుక్కుని— పైకి వచ్చేసరికి—పైముపట్టవచ్చని తను ముందు పైకి వచ్చాడు. తను వచ్చేసరికి శాంత నెమ్మదిగా చాప చుడుతోంది. తలవొంచుకుని పడకకుర్చీ మడిచి గోడ కానించింది. ఆమె దగ్గిరకెళ్ళి— బుజాల మీద చేతులువేసి గుండెలకి ఆ తలని హత్తుకోవాలని వెర్రికోరిక గలిగింది. శాంతకి ఏదో చెబుదామని—ఆమెకి ధైర్యం చెపుదామని – ఏదో అనిపిం చింది. కింద తలుపుశబ్దం వినపడటంతో తను పిరికివాడయిపోయాడు. అమ్మా వాళ్ళు పైకొస్తున్నారు, గభాలున తన గదిలోకి వెళ్ళిపోయాడు. అమ్మా వాళ్ళు పైకొచ్చారు, పక్కలు పరిచిన మంచాలమీద కూచుని – నాగయ్య గురించి, పోతన భక్తిగురించి ఖబుర్లాడుకుంటున్నారు. శాంతగొంతు వినిపిస్తుందేమోనని—తనుచెవులు నిక్క రించి కూచున్నాడు. ఒక్కమాట వినపడలేదు.

ఆ రాత్రి తనకి నిద్దరపట్టలేదు. ఏదో మత్తుగావుంది. మనసు వూరికే దూది పింజలా ఎగిరిపోతోంది. తను చేసింది— తప్పని, తను శాంతకి అన్యాయం చేశా నని, మనసులో ఏదోమూల కించగా

వుంది. కాని ఆ భావనని తొక్కిపెట్టే వాడు. అసలు శాంతగురించి ఆలోచించకుండా వుండాలని ప్రయత్నించాడు. కాని వొణుకుతున్న—ఆమె వొళ్లు తను మర్చిపోలేకుండా వున్నాడు? తననించి దూరంగా ఎందుకు పోలేదు? ఎందుకు అరవలేదు. భయమా యిష్టమా?

తెల్లవారి నిద్రలేచే సరికి—రాత్రి జరిగింది కలలా అనిపించింది. మొహం కడుక్కున్న తనకి; అమ్మ కాఫీ తెచ్చి యిచ్చింది. "శాంత ఏదీ" అని అడుగుదామని నోటిదాకా వచ్చింది. కాని తల్లికళ్లలోకి చూసి—అడిగే ధైర్యం లేకపోయింది. పేపరు చూసుకుంటున్న తనకి—శాంత తలపిడపతో కనిపిస్తే—తలంటుకుంది కాబోలు అనుకున్నాడు. ఒకటి రెండు సార్లు సూటిగా ఆమెని చూడబోయాడు. కాని శాంత తనదృష్టిని తప్పించుకు దూరదూరంగా వెళ్లి పోతుంది.

ఆ అమ్మాయిని పిల్చిమాట్లాడే ధైర్యం తనకి లేదు. ఏమని మాట్లాడాలి? ఏం చెప్పాలి? ఆ తరువాత రెండు రోజులూ ప్రయాణపు హడావుడి. సామానూ అదీ సర్దుకోవడం, ఆ రెండు రోజులూ అమ్మ తనని నీడలా వెంటపెట్టుకుని వుండేది. శాంతతో మాట్లాడే అవకాశం లేక పోయింది. స్టేషను కెళ్లేముందు బండెక్కుతున్నపుడు మటుకు—తన వంక తేరిపార చూసింది. ఆ కళ్లలో కన్నీరు తిరిగిందా? తనకి జ్ఞాపకం లేదు. కాని ఆ చూపులు—ఏవో సందేశాలని మూగగా నివేదిస్తున్న ట్లనిపించి, "ఆ తలమీద చెయ్యేసి—నీకు అన్యాయం చెయ్యను—నిన్ను పెళ్లి చేసుకుంటాను." అని చెబుదామనిపించింది. ఆ అమ్మాయిని వోదార్చాలని — ధైర్యం చెప్పాలని అనిపించింది. ఎట్లా? తనకి మాటలు రావు.

చీకట్లని చీలుస్తున్న రైలులో తనకి శాంత గురించి ఎన్నో ఆలోచనలు వచ్చాయి. అమ్మకి యీ విషయం చెప్పేయ్యాలని. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని రాసెయ్యాలని—ఎన్నో నిశ్చయాలు చేసుకున్నాడు. కాశీ వెళ్ళగానే అమ్మకి పెళ్ళి విషయం, శాంతకి ధైర్యం చెబుతూనే వుత్తరాలు రాసెయ్యాలనుకున్నాడు.

కాలేజీ తెరిచారు. హస్టలు స్టూండెట్సు. క్లాసులు, వీటితో ఆ భారమగు ఆవేదనా దృక్కులు కొంచెం కొంచెం దూరం కాజొచ్చాయి. ఏకాంతంలో వున్నప్పుడు. గంగవొడ్డుకి వెళ్ళినపుడు—పచ్చని సాయంత్రాల వేళ శాంత తియ్యగా—ఏదో సుందర స్వప్నంలా జ్ఞాపకానికి వచ్చేది. తను రాయని—రాయలేని జాబులు నిలవదీసి ప్రశ్నిస్తూండేవి. అంతరాత్మ, అన్యాయం చేస్తున్నావు సుమా అని హెచ్చ

రించేది. కాని యివ్వేమి తనను గట్టిగా బాధించేవి కాదు.

ఇంటి దగ్గిర నుంచి వారానికి రెండు సార్లు జాబులొచ్చేవి. శాంత జాబంతా రాస్తే. అమ్మ క్రింద సంతకం పెట్టేది. ఆ వుత్తరాలు చదువుతూ అమ్మని మర్చి పోయేవాడు. కొబ్బరి ఆకుల నీడల శాంత జ్ఞాపకం వచ్చేది. అవేవో తన కోసం శాంత ప్రత్యేకం రాసిన ప్రేమ లేఖల్లా ఫీలయేవాడు. ఒక్కొక్క జాబుని నాలుగైదు సార్లు చదువుకునే వాడు. మర్చి పోబోతున్న ఆజ్ఞాపకాన్ని ఒక్కొక్క జాబు తిరిగి ప్రజ్వలింప జేసేది.

పూజా సెలవలకి తను యింటికి రానని స్నేహితుల్తో—వుత్తరాది తిరిగి వస్తానని తల్లికి రాశాడు. తల్లి అయిష్టం తోనే వొప్పుకుంది. తను ఆ సెలవలకి యింటికి వెళ్ళలేదు. మనసు మొదట్లోలా అంత బాధపడటంలేదు. తను వూళ్లన్నీ తిరిగి—కాలేజికి వొచ్చేసరికి—అమ్మ రాసిన వుత్తరం వచ్చివుంది. తను వులిక్కి పడ్డాడు. ఆ దస్తూరి చూసి. శాంత వచ్చినప్పటి నుంచి, అమ్మ వుత్తరాలు రాయడం మానుకున్నది. ఈసారి ఆమె స్వయంగా ఎందుకు రాసిందో! అని మనసు పరి పరి విధాల పోయింది. శాంతా వాళ్ళని గురించి—వుత్తరాల్లో అడిగే ధైర్యం తనకిలేదు. ప్రతిసారి వాళ్ళని గురించి అడుగుదామని అనుకోడం ఏదో సంకోచంతో ఆగి పోవడం జరిగేది.

పరీక్షలు దగ్గిర పడుతున్నాయి. చాలా శ్రద్ధగా పట్టుదలగా చదువుతున్నాడు. మధ్య మధ్య శాంత జ్ఞాపకానికి వస్తూండేది. ఎన్నిసార్లు అణుచుకుందా మనుకున్నా తను చేసిన పొరబాటు పని పైకి సెగలుగా వస్తూనే వుండేది. ఎన్నో సార్లు శాంతకి వుత్తరం రాసి—పోస్టు చేసే ధైర్యం లేక చింపేశాడు. శాంత దస్తూరితో వుత్తరాలు పూర్తిగా ఆగి పోయినాయి.




"చూడండి ఆ చీరల షాపు దగ్గిర నించి మొగుణ్ని తిడ్తూంది—ఆవిడ్ని అరెస్టు చేయండి."

"మీకెందుకండి ఆ గోల.... అసలు ఆవిడ ఎవరు?"

"ఆఁ.... మా ఆవిడే లెండి."

డిశంబరు సెలవలకి యింటి కెళుతుంటే గుండె ఎందుకో ఆదుర్దాతో కొట్టుకుంది. ఈ సెలవల్లో అమ్మకి తన నిశ్చయాన్ని చెప్పేసి—శాంతతో పెళ్ళికి వొప్పించాలని ఘట్టిగా అనుకున్నాడు. ఒక్కసారి వెన్నెలలోని శాంత, బండెక్కుతుంటే, ఏదో అర్థించే ఆ కళ్ళు జ్ఞాపకానికి వచ్చాయి. ఇంటికొచ్చాడు. శాంతా వాళ్ల గదిలో, ఓ ముసలమ్మా—కొడుకూ వున్నారు. తన మనసెందుకో అదిరిపోయింది. వాళ్లేమయ్యారు? ఎక్కడికెళ్లారు? ఎందుకు వెళ్ళారు? ఎన్నో ప్రశ్నలు? ఎవరిని అడగాలి? ఎట్లా అడగాలి.

"అమ్మా—శాంతా వాళ్లు ఏరి?" అన్నాడు అన్నం తింటూ.

అమ్మ సంభాషణ తప్పించజూసింది. కాని తను మళ్లీ రెట్టించి అడిగాడు. పాపం ఆ తల్లి రోజులు బాగాలేవు. దాన్నెవరో అన్యాయం చేశారు" అంది జాలిగా.

తనకేదో పీడకల కంటున్నట్లుగా అనిపించింది. విస్తట్లో, చెయ్యి కదలలేదు. నోట్లోని ముద్ద ముందుకొస్తోంది. గొంతులో పెద్దరాయి వున్నట్లయింది.

"అసలేం జరిగిందమ్మా?" అన్నాడు తను, తలెత్తకుండానే.

"ఆ పిల్లదాన్నెవరో అన్యాయం చేశార్రా పాపం. అమాయకురాలిని గోతిలో తోశారు. లేడీడాక్టరు చెప్పేదాకా నేనే నమ్మలేదు" అంది తల్లి.

తల గిర్రున తిరిగినట్లయింది. 'నువ్వే-నువ్వే' అని వెయ్యి కంఠాలు ప్రతిధ్వనిస్తున్నాయి చెవులో. తల ఎత్తి తల్లి ముఖంలోకి చూడలేక పోయాడు తను.

"ఇప్పుడెక్కడున్నా రమ్మా వాళ్లు"? అని అడిగాడు తను. తన కంఠం తనకే వొణుకుతూ కొత్తగా అనిపించింది.

"ఎక్కడో అక్కడ! ఎక్కడయితే నేం? ఆ తల్లికడుపులో చిచ్చు పెట్టింది. అసలు అది అల్లాటిపిల్ల అనుకోలేదు నేను" అన్నది తల్లి.

అవును. తననికూడా మంచివాడనే అనుకుంటోంది తల్లి. తనెంత కిరాతకుడో, అసలు నేరస్తుడెవరో తన తల్లికి తెలియదు. తెలిస్తే తన మొహం చూస్తుందా? కళ్లంట నీరు తిరుగుతోంది. గభాలున కంచం దగ్గిరనుంచి లేచి పోయాడు తను. తల్లి తనవంక సాలోచనా—ఆశ్చర్యంగా చూస్తోంది.

చాలాసార్లు శాంతా వాళ్లగురించి వివరాలు అడగాలని ప్రయత్నించాడు. ప్రతిసారి ఆ ప్రసక్తి ఎత్తేసరికి గొంతు పూడుకు పోయేది. ఆ సెలవలు పదిహేను రోజులూ తల్లివంక సూటిగా చూడలేక పోయేవాడు. రాత్రిళ్లు నిద్దరపట్టేదికాదు. తను చేసినపని—పదేపదే తనని బాధించేది. డాబాలో ఆ రాత్రి చాప పరిచిన

చోటు చూస్తుంటే—కాళ్లు వాణికిపోయేవి ప్రశాంతంగా—హాయిగా కనిపించే తన డాబా; గదీ ఆ రెండూ అగ్ని పర్వతాల లాగా తనని మాడ్చి మసి చేస్తున్నాయి.

వూరినించి వచ్చిన నాలుగోరోజున కాబోలు, మామయ్య కొడుకు నోటి ద్వారా విన్నాడు. కూతురుకి మూడోనెల అని డాక్టరు చెప్పేసరికి — తల్లి వాళ్ళె రగని కోపంతో తిట్టి, కొట్టిందిట. రాత్రి పదింటిదాకా ఏడుస్తూ శోషవచ్చి పడి పోయిన శాంత, అర్ధరాత్రి లేచి నెమ్మదిగా బావిలో దూకిందట. తెల్లారగట్ల కూతురు పక్కమీద లేకపోవడం చూసిన తల్లి, ఖంగారుతో ఏడ్చి—మొత్తుకుని నలుగురినీ పిలిచేసరికి—నూతిలో తేలుతోందట శవం. మామయ్య కొడుకు చెబుతున్న యీవార్త వినేసరికి— తనవంట్లో రక్తం గడ్డకట్టుకు పోయింది. తను చేతులారా వొక ప్రాణిని చంపేశాడు. తనుచేసింది ఘోరహత్య. శాంత తనకెందుకు రాయలేదు? పోనీ, తల్లితోనైనా అసలు విషయం ఎందుకు చెప్పలేదు? తనకిరాస్తే—వెంటనే వచ్చేవాడే! తన నోటిలోంచి ఒక్కమాట రాలేదు. మెదడు పని చెయ్యడం మానేసింది. ఆ క్షణిక దౌర్బల్యానికి యింతశిక్ష? భగవాన్ యింత ఘోరమా?

సెలవలు అవకండానే సరంజామా కట్టేసుకుని కాశీ చేరుకున్నాడు. దృష్టి చదువుమీద లగ్నం చెయ్యలేకుండా వున్నాడు. మనసు పశ్చాత్తాపంతో దహించుకు పోతోంది. దేనిమీద దృష్టి నిలుపలేకుండా వున్నాడు. ఏదో బాధ తపన. ఆ ఏడు పరీక్ష పోయింది. తనుచదివితేగా! కన్నుమూసినా—తెరిచినా. పుస్తకం పుచ్చుకున్నా ఎక్కడ చూసినా, బండెక్కేప్పుడు అర్థించిన ఆ రెండుకళ్ళే. బలిపశువులా తనవంక చూసిందా? నిజంగా తను బలేకోరాడు. వేసంగిలో యింటికొచ్చాడు. ఎన్నోసార్లు తన పాపకృత్యాన్ని తల్లిఎదుట వెళ్లబోసుకోవాలని ప్రయత్నించాడు. కాని—కాని గొంతులోంచి పెగిలిరాలేదు. అసలు తల్లివంక సూటిగా చూడలేక పోయేవాడు తను. ఆవేసంగిలోనే తనకి పెళ్లి అయింది. పెళ్ళి వొద్దుఅనే వోపిక కూడాలేదు తనకి. తల్లికి ఎదురుచెప్పే పాటి అర్హత తనకు లేదు. ఏదో యాంత్రికంగా పెళ్లి జరిగిపోయింది. పెళ్లికూతురిని — చూడమంటే — చూశానన్నాడు. ఆ పెళ్ళికూతురి కళ్ళలో తనకు శాంతకండ్లు కనిపించాయే — భగవాన్ అనుకున్నాడు తను.

మూడు నిద్దర్లకి అత్తవారింటికి వెళ్లినపుడు తెలిసింది. అత్తవారింటి మూడో యింట్లోంచి వినపడే, ఆ భయంకర రోదన, పిచ్చిగా అరిచే ఆ రోదన శాంత తల్లిదని, పగలల్లా మామూలుగా వున్నా రాత్రి అయేసరికి అట్లా బిగ్గరగా

రోదిస్తూ కూచుంటుందిట. తనని చూడ టానికి వచ్చిన ఆమెని పల్కరించలేక పోయాడు. కడుపుశోకంతో ఏడ్చే ఆతల్లి కళ్ళలోకి చూసే అర్హత తనకేది? తన అపరాధాన్ని ఆతల్లికి ఎలా తెలియ జెప్పడం?

ఎక్కడో కోడికూసింది. వులిక్కి పడి టైము చూశాడు నారాయణమూర్తి. నాలుగుకి అయిదునిముషాలు తక్కువ. మరోసిగరెట్ ముట్టించాడు. తెల్లవారి పోతుంది. అవును ఎన్నిరాత్రిళ్ళు యిల్లా తెల్లవారలేదు. మళ్ళీ తను నిత్య కృత్యాల్లో పడతాడు. కాని గుండెల్లోని యీ గాయం ఆరదు. వెన్నెల రాత్రిళ్ళు తొలిచి తొలిచి బాధపెడ్తుంది.

ఎన్నోసార్లు తనపాపాన్ని తల్లికి నివేదించుకుందామని ప్రయత్నించాడు. కాని,కాని...చెప్పలేక పోయేవాడు. ఆఖ రికి—ఆరోజు అమ్మకి తెలివితప్పిపోయే ముందు తను చెప్ప ప్రయత్నించాడు. తల్లి తనని వొదిలి వెళ్లి పోతోంది. ఆ తుదిఘడియల్లోనైనా తన పాపకృత్యాలు ఆమెకి చెబుదామనుకున్నాడు. ఆమెకి చెప్పుకుంటేగాని తనకి మనశ్శాంతి వుండదు. ఈ క్షోభని తల్లికి నివేదిం చాలి, అప్పటికిగాని తనకి నిష్కృతి లభించదు. "అమ్మా" అన్నాడతను. నూతిలోంచిలావచ్చింది సన్నగా తన పిలుపు.

తల్లి కళ్ళుతెరిచి చూసింది తనవంక. అంతబాధలోనూ ఆ కళ్ల లో ఎంత ఆర్ద్రత.

"అమ్మా — ఆ శాంత —" అన్నాడు తన మాటలు పెగిలిరావడంలేదు తల్లి తన చేతిని, ఒక్కసారి గట్టిగా పట్టు కుంది. ఆ కళ్లలో ఏదోభయం, ఏదో వేదన కళవరపాటు. గబుక్కున కళ్లు మూసుకుంది. ఇంతలో తన భార్యగడి లోకి రావడం, కాసేపట్లో తల్లికి పూర్తిగా స్మారకం పోవడం జరిగింది.

తను చెపుదామనుకున్నది, చెప్పలేక పోయాడు. చేసిన పాపం చెప్పి—తల్లిని క్షమార్పణ వేడుకుంటే కొంత బాధ తగ్గేదేమో! కాని తను పిరికి వాడు. ఒట్టి పిరికి వాడు. తల్లి తన ఘాతుక కృత్యాన్ని అర్థం చేసుకుందా?తన పాపం ఆమెకి తెలుసా? అంతా తెలిసే సహిస్తూ వచ్చిందా? వీటికి జవాబు ల్లేవు. భగ వంతుడు తన మనశ్శాంతిని హరించాడు. ఈ బాధతో, ఈ ఆవేదనతో, యీ పాప ఫలంతో తను యిట్లా కృంగిపోవల సిందే........ ఇది శాంత యిచ్చిన శాపమా?

నారాయణమూర్తిని ఆమె నేత్ర ద్వయం నిరంతరం వెన్నాడుతూనే వుంటుంది. అతని కీజన్మకి శాంతి లేదు — అతని ప్రశ్నలకి జవాబులు దొరకవు. ★